ఎస్సీ, ఎస్టీ పెండింగ్ కేసులు పరిష్కరించాలి

విశాలాంధ్ర - తగరపువలస: భీమునిపట్నం ఆర్డీవో కార్యాలయంలో సబ్ డివిజనల్ విజినెస్ అండ్ మోనిటరింగ్ కమిటీ (ఎస్సీ, ఎస్టీ పిఓ యాక్ట్) సమావేశం జరిగింది. డివిజినల్ పరిధిలో ఉన్న ఎస్సీ, ఎస్టీ పెండింగ్ కేసులు, రెవెన్యూ పెండింగ్ కేసులు పరిష్కార నిమిత్తం సంబంధిత అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ చర్చకు వచ్చిన సమస్యలన్నీ వారం రోజుల్లో పరిష్కరించాలని తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో కానాల సంగీత్ మధుర్, డీఏవో మనోరంజని, తహశీల్దార్లు, ఏసీపీలు, సభ్యులు బోనెల ఏసేపు(జోసెఫ్), జలగడు గుల శ్రీనివాస్, దుమ్మెద అప్పలసూరి, విజయ్ కుమార్, శ్రీనివాసు, ప్రొఫెసర్ సుబ్బారాయుడు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు, స్థలాలు ఇవ్వాలి: సీపీఐ

విశాలాంధ్ర - మల్కాపురం: ఇల్లు లేని వారికి ఇల్లు ఇవ్వాలని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ పశ్చిమ నియోజకవర్గం కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ పేర్కొన్నారు. గురువారం మల్కాపురం గ్రామమండలిలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లకు అర్హులుగా ఉన్న లబ్ధిదారులను తొలగించారని, వారికి టీడీపీ ప్రభుత్వమైనా టిడ్కో ఇళ్ల అర్హులందరికీ ఇవ్వాలని, పట్టణ ప్రాంతాల్లో స్థలం లేని వారి పేదలకు రెండు సెంట్లు స్థలం ఇచ్చి ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇవ్వాలని అన్నారు. గ్రామాలలో ఉన్న వాళ్లకి మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని, ఇళ్ల స్కీముకు 500000 రూపాయలు అర్హులైన పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, పశ్చిమ నియోజకవర్గం సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు, కె.కామేశ్వరరావు, కె.కనక రాజు, సురేష్, వెంకట్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గీతంలో సి.వి.రామన్ 136వ జయంతి

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రముఖ శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్ 136వ జయంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లో గల సర్.సి.వి.రామన్ విగ్రహం వద్ద గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నోబుల్ బహుమతి గ్రహీతలను స్ఫూర్తిగా తీసుకుని శాస్త్ర విజ్ఞాన రంగంలో పరిశోధనలు జరపాలని పిలుపునిచ్చారు. భారతీయ శాస్త్ర వేత్తలు అన్ని రంగాలలో

రాణిస్తున్నారని అలాగే ఇతర దేశాలకు వెళ్ళి తమ ప్రతిభను చాటుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం శాస్త్ర విజ్ఞాన అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో నోబుల్ బహుమతి అందుకునే స్థాయిలో పరిశోధనలు జరపాలని సూచించారు. గీతంలో మూర్తి పేరిట పరిశోధన కేంద్రాలను అభివృద్ధి చేశామని తెలిపారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేదవతి, గీతం మూర్తి ప్రయోగ శాలల విశిష్ట ప్రొఫెసర్ టాటా, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ అభివృద్ధికి రోడ్ మ్యాప్ సిద్ధం

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పారిశ్రామిక వేత్తలకు సంపూర్ణ సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. విశాఖ అభివృద్ధికి ఇప్పటికే రోడ్ మ్యాప్ సిద్ధం చేసినట్లు వెల్లడించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కూడా సానుకూల దృక్పథంతో ఉందని అతి కొద్ది రోజుల్లోనే కార్యాచరణ ప్రారంభమవుతుందని చెప్పారు. కలెక్టరేట్ మీటింగు హాలులో గురువారం సాయంత్రం జరిగిన సీఐఐ 4వ జోనల్ స్థాయి సమావేశంలో ఆయన వివిధ అంశాలపై మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ముఖ్య మంత్రి జిల్లా అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షలో ప్రధాన అంశాలను సీఐఐ సభ్యులకు వివరించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చే నాటికి జిల్లాలోని అన్ని అభివృద్ధి ప్రాజెక్టులు పూర్తి చేయాలని సీఎం చెప్పారని కలెక్టర్ గుర్తు చేశారు. ఆ మేరకు వీఎంఆర్డీఏ, జీవీఎంసీ సహాయంతో అభివృద్ధి పనులకు రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామని, అతి త్వరలోనే కార్యాచరణ ప్రారంభమవుతుందన్నారు. జిల్లాలో చేపట్టే అభివృద్ధి ప్రాజెక్టుల్లో ముఖ్యమైన రోడ్ల అనుసంధానంపై ప్రధానంగా దృష్టి సారిస్తామని, ట్రాఫిక్ సమస్యలు లేకుండా, వాహన రద్దీని నియంత్రించే విధంగా ఎక్స్ ప్రెస్ కారిడార్లు ఏర్పాటు చేస్తామని, ఉన్న రోడ్లను విస్తరిస్తామని చెప్పారు. రోడ్ కం మెట్రో కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు కూడా సిద్ధమయ్యాయని, కేంద్రం అనుమతికి పంపిం చామని వివరించారు. పీపీపీ విధానంలో ప్రాజెక్టులు చేపట్టడం ద్వారా జిల్లా సమగ్ర అభివృద్ధికి పటిష్ట చర్యలు చేపడతామని, ఆ దిశగా అన్ని రకాల సాంకేతిక ప్రక్రియలను పూర్తి చేస్తున్నామని వివరించారు. లంకెలపాలెం నుంచి తగరపువలస వరకు ఉన్న ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా పైవంతెనలు లేదా ఎక్స్ ప్రెస్ కారిడార్లు నిర్మిస్తామని చెప్పారు. నగరంలో నిరంతరం తాగునీటి సరఫరా జరిగేలా చూస్తామని, 100 శాతం భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. ఈపీడీసీఎల్ సీఎండీ పృధ్వీతేజ్ ఇమ్మడి మాట్లాడుతూ గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని దానికి పారిశ్రామిక వేత్తలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పరిశ్రమలకు సమీపంలో ఉండే ప్రజలతో పారిశ్రామిక వేత్తలు సత్సంబంధాలు కొనసాగించాలని, కొన్ని రకాల సమస్యలు ఉత్పన్నం కాకుండా జాగ్రత్త వహించాలని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సూచించారు. భద్రతా ప్రమాణాలను పాటించాలని, ప్రజలు, ఉద్యోగుల ప్రాణ రక్షణకు చర్యలు తీసుకోవాలని, నిధులు కేటాయించాలని హితవు పలికారు. జిల్లాలో ట్రాఫిక్ సమస్య నివారణకు ఏమైనా సలహాలు, సూచనలు ఉంటే 79950 95799 నెంబరుకు తెలపాలన్నారు. సీఐఐ ఏపీ సెక్టార్ ఛైర్మన్ మురళీ కృష్ణ, సీఐఐ విశాఖపట్టణం జోన్ ఛైర్మన్ గ్రంధి రాజేశ్, ఇతర సభ్యులు పలు అంశాలపై సలహాలు సూచనలు అందజేశారు. టెంపుల్ టూరిజం, ట్రావెల్ టూరిజంకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పరిశ్రమలకు ప్రోత్సహకాలు అందజేయాలని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి సహకారం అందించాలని కోరారు. మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం మరింత సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా దర్బార్‌కు విశేష స్పందన

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 61, 62 వార్డు మల్కాపురం ప్రకాష్ నగర్ కూడలి వద్ద ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు హాజరై ప్రజల నుండి వినతులు స్వీకరించారు. సామాజిక పింఛన్లు, ఇళ్ల స్థలాలు మంజూరు, కొత్త రేషన్ కార్డులు మంజూరు, ఇంటి పనుల పేరు మార్పుల కొరకు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు స్వీకరించడంతోపాటు వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారుల సమక్షంలో పరిష్కారానికి చొరవ చూపాలని ప్రజా ప్రతినిధులు ఉన్నతాధికారులతో త్వరతిగతన సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీనుల విందుగా ఆర్జిత సేవలు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి ఆలయంలో ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. గురువారం ఆలయ వైదిక సిబ్బంది ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఆలయ సహాయ కార్యనిర్వహణ అధికారి ఆనంద్ కుమార్, పర్యవేక్షణాధికారి ప్రసాద్ పర్యవేక్షణలో స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలో అధిష్టింపజేసి స్వర్ణ పుష్పార్చన, పిదప వేద మంత్రాలు నాధ స్వర మంగళ వాయిద్యాల నడుమ శ్రీ స్వామి వారి నిత్య కళ్యాణం జరిగింది.

పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలి: సీపీఐ

విశాలాంధ్ర - విశాఖ: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో కంచరపాలెం మెట్టు జంక్షన్ ముత్యాలమ్మ గుడి వద్ద గురువారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ ఉత్తర నియోజకవర్గం కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని చంద్రబాబు చెప్పారని, అధికారంలోకి వచ్చిన తర్వాత దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీల పేరుతో యూనిట్‌కి రూ.1.37 పెంచడానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రజలపై రూ.6,138 కోట్ల భారం పడుతుందని అన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీల పేరుతో రూ.1.03 భారం వేసిందని, ఆ భారం ఇప్పటికీ కొనసాగుతున్న తరుణంలో మళ్ళీ ఛార్జీల పేరుతో ప్రజలపై భారం వేయడం సరికాదని అన్నారు. ఏపీ ఈఆర్‌సికి ఎటువంటి సమాచారం లేకుండా హిందూజా కంపెనీకి వేల కోట్ల రూపాయలు ముట్ట చెప్పడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు పెట్టబోమని చెప్పి నేడు స్మార్ట్ మీటర్ల పేరుతో మరో రూ.7వేల కోట్ల రూపాయలు భారం వేయటానికి ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. గతంలో జగన్ ప్రభుత్వం అదానీకి లొంగిపోయినట్టే చంద్రబాబు ఆదానీ అడుగులకు మడుగులొత్తే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు వేసే ప్రయత్నాన్ని మానుకోవాలని, లేనిపక్షంలో సీపీఐ నాయకత్వంలో ఇతర వామపక్షాలను, ప్రజాసంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఉత్తర నియోజకవర్గ సహాయ కార్యదర్శి నెయ్యల నాగభూషణరావు, కంచరపాలెం మార్కెట్ శాఖ కార్యదర్శి హరిత, నూకరత్నం, ధనలక్ష్మి, ఏ.ఆదినారాయణ, చీకటి గురుమూర్తి, ఈశ్వరరావు, రవి, సూరిబాబు, యశోద, పద్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా కేంద్రంగా ఆంధ్రప్రదేశ్

విశాలాంధ్ర - భీమిలి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని క్రీడా కేంద్రంగా మార్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నూతన క్రీడా పాలసీతో సిద్ధం అవుతున్నారని భీమిలి జోన్ 3వ డివిజన్ అధ్యక్షులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. భీమిలి టీడీపీ కార్యాలయంలో గంటా నూకరాజు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాన్ని క్రీడా కేంద్రంగా మార్చేందుకు నాలుగు లక్ష్యాలతో పాలసీ రూపకల్పన దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని అన్నారు. ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా 2 నుండి 3 శాతానికి పెంచడం శు

భపరిణామమని అన్నారు. రాష్ట్రంలో క్రీడా కోచింగ్ కేంద్రాలు ఏర్పాటుకు రంగం సిద్ధమయిందని అన్నారు. ఏషియన్ గేమ్స్, ఒలింపిక్స్ గేమ్స్‌లో అత్యధిక పతకాలు రాష్ట్రం నుండి వచ్చేవిధంగా ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించే క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకం అధికరెట్లు చేయడం చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం క్రీడలు పట్ల ఎంత ప్రణాళికతో అడుగులు వేస్తుందో అర్థం చేసుకోవాలని అన్నారు.

పంచారామాలకు బస్సులు

విశాలాంధ్ర - సింహాచలం: కార్తీక మాసం సందర్భంగా సింహాచలం ఆర్టీసీ బస్సు డిపో నుండి పంచారామాలు దర్శనం కోసం ఈ నెల 10, 17, 24 తేదీల్లో సాయంత్రం గం.5లకు డిపో నుండి బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ రాజశేఖర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సిటి మెట్రో ఎక్స్‌ప్రెస్‌కు ఒక్కరికీ రూ.1,650/-, అల్ట్రా డీలక్స్ రూ.2,100/- లు నిర్ణయించినట్లు తెలిపారు. ఆయా తేదీల్లో సాయంత్రం ఐదు గంటలకు బయలుదేరి తిరిగి సోమవారం రాత్రికి బస్సు చేరుకుంటుందని, ఈ సదావకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని వివరాలకు 7997204938, 7382917295 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పవన్‌తో సర్పంచుల సంఘం భేటీ

విశాలాంధ్ర - ఆనందపురం: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను అమరావతిలో గురువారం రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు, గంభీరం సర్పంచ్ వానపల్లి లక్ష్మి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 16 అంశాలతో కూడిన సమస్యలను డిప్యూటీ సీఎం వద్ద వివరించారు. ముఖ్యంగా రాజధానిలో భవన నిర్మాణం కొరకు రెండు ఎకరాల స్థలం కేటాయించాలని, అందుకు డిప్యూటీ సీఎం పవన్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంబర్ అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులు వానపల్లి ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లింపులో ఉక్కు యాజమాన్యం విఫలం

ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షులు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: ఉక్కు ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లింపులో యాజమాన్యం పూర్తిగా విఫలం చెందిందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న రిలే దీక్షలు గురువారం 1365వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సింటర్ ప్లాంట్, ట్రాఫిక్, ఈఎస్అండ్ఎఫ్, ఎఫ్ఎండి, ఈఆర్ఎస్, అడ్మిన్ విభాగాలకు చెందిన ఉద్యోగులు, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి ఆదినారాయణ మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం సకాలంలో వేతనాలు చెల్లించక పోవడంతో కార్మిక వర్గం అసంతృప్తితో ఉన్నారని అన్నారు. ఉక్కు యాజమాన్యం కార్మికులకు సంబంధించిన ఆర్థిక ప్రయోజనాలను తగ్గించినప్పటికీ మొక్కవోని దీక్షతో ఉక్కు ఉత్పత్తిలో నిమగ్నమయ్యారని గుర్తు చేశారు. తక్షణమే ఉక్కు యాజమాన్యం కార్మికులకు రావలసిన ఆర్థిక ప్రయోజనాలతో పాటు వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో నాయకులు ఏ.మసేన్‌రావు, కె.రాజబాబు, బోండా అప్పారావు, కర్రి బాబు రావు, ఎస్.శ్రీనివాస్, కాశీ రమణ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు ఇబ్బంది లేకుండా సదుపాయాలు కల్పించాలి

జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగరంలో ఉన్న రాత్రి బస కేంద్రాలను నిరాశ్రయులకు ఇబ్బంది కలుగకుండా, వారికి అన్ని సదుపాయాలను కల్పిస్తూ నిర్వహించాలని నిర్వాహకులకు జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఆదేశించారు. గురువారం ఆయన జోన్-4 పరిధిలోగల టిఎస్ఆర్ కాంప్లెక్స్ మొదటి, రెండవ అంతస్తులోనున్న రెండు సచివాలయ కేంద్రాలను, నైట్ షెల్టర్‌ను అధికారులతో కలిసి పరిశీలన చేశారు. ఈ పరిశీలనలో ముందుగా కమిషనర్ టిఎస్ఆర్ కాంప్లెక్స్ మొదట అంతస్తులో ఉన్న 214, 230 గల సచివాలయ కేంద్రాలను పరిశీలించి అందులో సిబ్బంది పనితీరును, ఒక రోజుకి ఎంతమంది ప్రజలు సర్వీసులు సచివాలయంలో పొందుతున్నారనే అంశాలపై ఆరా తీశారు. అనంతరం టి ఎస్ ఆర్ కాంప్లెక్స్ రెండవ అంతస్తులో జీవీఎంసీ- ఏ.యూ.టి.డి స్వచ్ఛంద సంస్థ "ఆశ్రయ" అనే పేరుతో నిర్వహిస్తున్న నిరాశ్రయుల ఆశ్రయ కేంద్రాన్ని (నైట్ షెల్టర్)ను పరిశీలించి అందులో ఆశ్రయం పొందుతున్న నిరాశ్రయ మహిళలను, పురుషులను పరిశీలించి, ఎంతమంది ఆశ్రయం పొందుతున్నారని ఆరా తీయగా మహిళలు 28, పురుషులు 58 మంది మొత్తంగా 86 మంది ఈ ఆశ్రయ కేంద్రంలో ఉన్నారని, మంచినీటి సదుపాయం కొరకు ప్రత్యేకంగా ఒక కుళాయిని ఈ ఆశ్రయ కేంద్రానికి మంజూరు చేయాలని నిర్వాహకులు ప్రగడ వాసు కమిషనర్‌కు కోరారు. కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజనీర్ పివి సత్యనారాయణ రాజు, జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీనివాస్ ప్రసాద్, యూసిడి- డిపిఓ ఎంవిడి ఫణి రామ్, ఏసిపి ఝాన్సీ లక్ష్మి, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గీతంలో విదేశీ విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - మధురవాడ: వివిధ దేశాల నుంచి వచ్చి గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ఆంతర్జాతీయ విద్యార్థులు భారత దేశ సంస్కృతి సంప్రదాయాలను అర్థం చేసుకుని మంచిని గ్రహించి విద్యార్థులతో సాంస్కృతిక సంబంధాలను పెంచుకోవడం ద్వారా ఉన్నత వ్యక్తిత్వంతో పట్ట భద్రులుగా తమ దేశాలకు వెళ్ళాలని డిప్యూటీ పోలీస్ కమిషనర్ వి.అజిత పేర్కొన్నారు. గీతంలో నూతనంగా ప్రవేశం పొందిన విదేశీ విద్యార్థులకు గురువారం అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విదేశీ విద్యార్థులకు విశాఖ సురక్షితమైనదని పేర్కొన్నారు. ప్రారంభంలో సిలబస్‌ను అర్థం చేసుకుని అధ్యాపకులను అనుసరిస్తూ తదనంతరం బాహ్యప్రపంచంపై దృష్టిసారించాలన్నారు. విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కాకుండా చుట్టూ ఉన్న సమాజాన్ని అర్థం చేసుకుని వ్యక్తిత్వ వికాసంతో ఎదగాలన్నారు. వివిధ దేశాల విద్యార్థుల పరస్పర అవగాహన, ఒకరి సంస్కృతిని మరొకరు అర్థం చేసుకుని ఎదగాలని సూచించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ అంకిత భావం, కష్టపడే గుణం ఉంటే ఉన్నత విద్యలో ఉత్తమ ఫలితాలను సాధించవచ్చునని ఆమె సూచించారు. గీతం అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం డైరెక్టర్ డాక్టర్ కె.పి.సి.కిషన్ మాట్లాడుతూ గీతంలో ప్రస్తుతం 40 దేశాలకు చెందిన 450 మందికి పైగా విదేశీ విద్యార్థులు వివిధ కోర్సులు అభ్యసిస్తున్నారని, కొత్త విద్యా సంవత్సరంలో 29 దేశాల నుంచి విద్యార్థులు ప్రవేశం పొందారని వెల్లడించారు.

గిడిజాలలో ఆచూకి లేని పశు వైద్యులు

1962 టోల్ ఫ్రీకి సమాచారం అందించినా పట్టించుకోని వైనం

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో గిడిజాల గ్రామపంచాయతీలో పశువులకు వైద్యం అందక రైతన్నలు తరచు ఇబ్బందులు పడుతున్నారు. 1962 టోల్ ఫ్రీ సర్వీస్ నెంబర్‌కు కాల్ చేసినా సరైన స్పందన లేదని, గత మూడు రోజులుగా సమాచారం అందించినప్పటికీ వైద్యులు రాలేదని, అలాగే పశు వైద్యులు శ్రీనివాస్ కూడా ఎప్పుడు కూడా అందుబాటులో ఉండడం లేదని వాపోతున్నారు. కానీ హాజరు పట్టికలో ఆయన వచ్చినట్టు సంతకం పెడతారని, గత పది రోజులుగా డాక్టర్ అందుబాటులో లేరని సమయానికి కూడా రాకపోవడం, ఆయన వ్యవహార శైలి మారకపోవడం సరైన మందులు పంపిణీ చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారని విమర్శలు అయితే బలంగా ఉన్నాయి. అయితే గిడిజాల కేంద్రం తాలూకా వెటర్నరీ డాక్టర్లు ఎవరు పట్టించుకోవడంలేదని, ఆవు దూడకు గత నాలుగైదు రోజుల నుంచి బాగోలేదని తెలియపరచినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని ఇబ్బందులు పడుతున్నామని స్థానిక రైతులు షిణగం శ్రీను వాపోతున్నారు. జిల్లా అధికారులు చొరవ చూపి పాడి రైతన్నల సమస్యలు పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

గ్రామకంతం మా ఆధీనంలోనే ఉంది

గంభీరం పంచాయతీ ప్రజలు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో గంభీరం గ్రామపంచాయతీ ఐఐఎం ప్రక్కనే ఉన్నటువంటి గ్రామకంతం సర్వే నెంబరు 140 సుమారు 13 ఎకరాల 80 సెంట్లు గ్రామ కంతం స్థలం పూర్తిగా మా ఆధీనంలో ఉందని గ్రామ ప్రజలు తెలిపారు. అక్రమార్కుల ఆధీనంలో గ్రామకంతం అనే శీర్షికపై వెలువడిన కథనానికి గ్రామస్తులు స్పందించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు విలేకరులతో మాట్లాడుతూ చాలా ఏళ్లుగా గ్రామకంతం మా ఆధీనంలోనే ఉందని ఇటీవల కాలంలో గ్రామకంతాన్ని ఏపీఐఐసీకి ఇవ్వడానికి ప్రయత్నాలు జరిగాయని వీటిని అందరం మూకుమ్మడిగా తిప్పికొట్టామన్నారు. అప్పట్లో 35 కుటుంబాలు ఉన్న ఈ స్థలంలో ప్రస్తుతం సుమారు 300 కుటుంబాలు పైగా ఉన్నారన్నారు. మూడు తరాల నుండి హెరిటేజ్ భూములు ఆక్రమణకు గురికాకుండా ఫెన్సింగ్ వేయడం జరిగిందని గ్రామస్తులు పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు పరిశీలన జరిపి, స్థల పత్రాలు మంజూరు చేసి గ్రామస్తులకు హక్కులు కల్పించాలని గ్రామ ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

విశాలాంధ్ర ఎఫెక్ట్

విజయసాయిరెడ్డిని కలిసిన వాసుపల్లి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త విజయ సాయి రెడ్డిని గురువారం ఉదయం విశాఖలో జరిగిన ఓ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ కలిశారు. నూతనంగా ఉత్తరాంధ్ర జిల్లాలకు ఇన్‌చార్జిగా విజయసాయిరెడ్డి నియమితులైన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర రాజకీయ అంశాల పట్ల కాసేపు ముచ్చటించారు. అలాగే వైసిపి పూర్వవైభవం, పార్టీ అభివృద్ధి భవిష్యత్తు కార్యాచరణ వివిధ రాజకీయేతర విషయాలపై మాట్లాడుకున్నారు.

వెలుగు బకాయిలు వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర - ఆనందపురం: తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని, బకాయి పడ్డ ఆరు నెలలు వేతనాలను వెంటనే విడుదల చేయాలని గురువారం ర్యాలీ నిర్వహించారు. మండలంలోని వీవోఏలు గురువారం ఆనందపురం వెలుగు కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. వీవోఏల సంఘం ప్రధాన కార్యదర్శి పారుపిల్ల అపర్ణ, మజ్జి శ్యామల మాట్లాడుతూ కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలన్నారు. 6 నెలలు బకాయి వేతనాలు చెల్లించాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. కూటమి ప్రభుత్వం వీవోఏల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మజ్జి శ్యామల, పారుపిల్లి అపర్ణ, చందక రమణమ్మ, గుడివాడ రమణమ్మ, తమరాడ రమాదేవి, మామిడి దేవి,అద్దూరి సంతోష్ కుమారి ,పాడ్రింకి సత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ పనులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర - విశాఖ: హెల్త్ ఎరీనా, సెంట్రల్ పార్క్, సీ హ్యారియర్, చిల్డ్రన్ ఎరీనా నిర్వహణ పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమీషనర్ కెఎస్ విశ్వనాథన్ ఆదేశించారు. జోన్ల వారీగా గురువారం నిర్వహించిన సమీక్షాలో చీమలాపల్లి, ఎండాడ కన్వెన్షన్ సెంటర్ల పనుల పురోగతిని సమీక్షించారు. ఈ

సమావేశంలో ప్రధాన ఇంజినీర్ వి.భవానీ శంకర్, కార్యనిర్వహక ఇంజినీర్లు ఎస్‌వీఎస్ఎన్ రాజు, రామరాజు, సుధీర్, ఉప కార్యనిర్వహక ఇంజనీర్లు, సహాయ ఇంజినీర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నడుపూరు హైస్కూల్ విద్యార్థినులు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: గత నాలుగు రోజులుగా నాంది ఫౌండేషన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో విశాఖ జిల్లా వ్యాప్తంగా ఉన్న హైస్కూల్ స్థాయిలో విద్యార్థినులకు స్టాండ్ జంపింగ్, 02.50 మీటర్స్ రన్నింగ్, షటిల్ రన్నింగ్ సెలెక్షన్స్ నిర్వహించారు. ఆ సెలెక్షన్స్‌లో జిల్లా స్థాయిలో మొత్తముగా 120 మంది విద్యార్థులను ఎంపిక చేసి వారిలో బాగా ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు 75వ వార్డు కార్పొరేటర్ దంపతులు పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేయడం జరిగింది. నడుపూరు హై స్కూల్ నుండి రాష్ట్ర స్థాయికి సెలెక్ట్ అయినా గెద్దం హాసిని, కొర్ల ఉజ్వల, నున్న భారతిలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాంది ఫౌండేషన్ సభ్యులు, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీని వాస్, నాయకులు ములకలపల్లి పెంటయ్య, పులి సురేష్ రెడ్డి (బాబీ), దొమ్మేటి సోము నాయుడు, బస అప్పల రెడ్డి, కాకినాడ అప్పల రాజు, ఊరుకుటి అప్పల రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - భీమిలి: 11 కేవీ భీమిలి టౌన్, 11 కేవీ పాలిటెక్నిక్ ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 09.00 నుండి మధ్యాహ్నం 3:00 గంటల వరకు బ్యాంక్ కాలనీ, తాతాజీ నగర్, ఎల్లంపేట, మహాలక్ష్మీపురం, దక్కటీపాలెం, రజిలింగాపేట, రేఖవానిపాలెం, రయపాలెం, మరడపాలెం, ములకుద్దు, స్మిత్ జగనన్న కాలనీ, నెర్లెవలస, ఎస్.ఓ.ఎస్ భీమిలి టౌన్ ప్రాంతాలలో విద్యుత్ నిలుపు చేయడం జరుగుతుందన్నారు.

ఆనందపురం: జోన్ 3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆనందపురం సబ్ స్టేషన్ లైన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పెద్దిపాలెం, పొదుగు పాలెం, చందక, గొట్టిపల్లి, వెంకటాపురం, కుసులువాడ, బీపీ కల్లాలు, దుక్కవానిపాలెం, ఆనందపురం, వేములవలస, పాలవలస, వావురుపాలెం, తర్లువాడ, ఎల్.వి.పాలెం, గుడిలోవ, బోని ప్రాంతాలకు గృహ, వాణిజ్య, వ్యవసాయ వినియోగదారులు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఆనందపురం ఏఈ సురేష్ కుమార్ తెలిపారు.

హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 62వ వార్డు గుడివాడ అప్పన్న కాలనీలో హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ (యూఎస్ఏ) సంస్థ వారు గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు పి.జి.వి.ఆర్ నాయుడు (గణబాబు) ముఖ్య అతిథిగా పాల్గొని హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ ఫౌండర్ శివలంక సుధాకర్, యశ్వంత్‌ల సేవలను అభినందించారు. నియోజకవర్గంలో పలు అంగన్వాడీ సెంటర్లకు వాటర్ ప్యూరిఫైడ్ మెషిన్లను ఇవ్వగా వాటిని సందర్శించిన ఆయన వాటి పనితీరు అడిగి తెలుసుకున్నారు. దుర్గానగర్‌లో గల అంగన్వాడీ సెంటర్‌లో ఇన్‌స్టాల్ చేసిన పూరిఫైడ్ మెషిన్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మద్దిల యశ్వంత్, టీం సభ్యులు దుర్గారావు, నూకరాజు, బాలరాజు, రాజు, సతీష్, సురేష్, రవి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో భోజనశాల ప్రారంభం

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి మండలం ఎర్రయ్యపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మించిన భోజనశాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి హనుమంతరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో గల విద్యార్థులు అల్పాహారం, భోజనం చేసేందుకు సరి అయిన భోజన శాల లేకపోవడాన్ని గుర్తించిన దివిస్ సంస్థ నూతన భోజనశాల నిర్మించడం అభినందనీయమని అని ఆయన అన్నారు. అనంతరం ఆయన పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోసారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి 1 శివరాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శ్రమజీవుల కాలనీలో రోడ్డు పనులు ప్రారంభం

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని లోడగలవానిపాలెం పంచాయతీ పరిధిలో శ్రమజీవుల కాలనీలో గురువారం 15 లక్షల రూపాయలతో రోడ్డు పనులు చేపట్టారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో శ్రమజీవుల కాలనీలో వీధి రోడ్లు ఏర్పాటుకు స్థానిక మాజీ సర్పంచ్ లోడగల రమణ, మాజీ ఎంపీటీసీ లోడగల వెంకట్రావు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బమ్మిడి తారక్, రౌతు వెంకటప్పలు, బంటుబోయిన శ్రీను, పైడిరాజు, నాని, సురేష్, రాజు, అప్పారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, జెడ్ ఫ్లిప్6లపై సామ్‌సంగ్ రాయితీలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: సామ్‌సంగ్ ఆరవ తరం ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్లు గెలాక్సీ జెడ్ ఫోల్డ్6, గెలాక్సీ జెడ్ ఫ్లిప్6పై అద్భుతమైన రీతిలో పరిమిత కాల ఆఫర్లను ప్రకటించింది. గెలాక్సీ జెడ్ ఫోల్డ్6ని కొనుగోలు చేసే వినియోగదారులు 24 నెలల నో కాస్ట్ ఈఎంఐ తో పాటుగా రూ. 144999కంటే తక్కువ ధరకే స్మార్ట్‌ఫోన్‌ను పొందుతారు. అదేవిధంగా, గెలాక్సీ జెడ్ ఫ్లిప్6ని కొనుగోలు చేసే వినియోగదారులు పరిమిత కాలవు పండుగ ఆఫర్‌లో భాగంగా 24 నెలల నో-కాస్ట్ ఈఎంఐ తో పరికరాన్ని కేవలం రూ. 89999కి పొందుతారు. గెలాక్సీ జెడ్ ఫోల్డ్6 ధర రూ. 164999 మరియు గెలాక్సీ జెడ్ ఫ్లిప్6 ధర రూ. 109999 నుండి ప్రారంభమవుతుంది. గెలాక్సీ జెడ్ ఫ్లిప్6 ను రూ. 2500 నుండి గెలాక్సీ జెడ్ ఫోల్డ్6 ను రూ. 4028 తో ఈఎంఐ అవకాశాల ద్వారా కొనుగోలు చేయవచ్చు.

కేఎఫ్‌సీ నుంచి ఎపిక్ టెస్ట్ ఎంపికలు ఆవిష్కరణ

విశాలాంధ్ర - విశాఖపట్నం: కేఎఫ్‌సీ ఎపిక్ టెస్ట్ బ్రాండ్ ఇప్పుడు దాని తాజా క్యాంపెయిన్‌లో కూడా – టెస్ట్ ది ఎపిక్ అనే ప్రచారాన్ని తీసుకువచ్చింది. దాదాపు మూడు దశాబ్దాలుగా, కేఎఫ్‌సీ ఫింగర్ లికిన్ చక్కని క్రిస్పీ చికెన్‌తో దేశవ్యాప్తంగా అభిమానులను ఆనందపరుస్తోంది. ఈ నవంబరులో కేఎఫ్‌సీ అత్యధికంగా విక్రయం అవుతున్న తన ఆహార ఉత్పత్తుల శ్రేణితో వేడుక చేసుకునేందుకు ఫ్యాన్ ఫేవరెట్స్ జినానిక్ హాట్ %c% క్రిస్పీ చికెన్, హాట్ వింగ్స్ నుంచి బోన్‌లెస్ చికెన్ పాప్‌కార్న్, పెరి-పెరి బోన్‌లెస్ చికెన్ స్ట్రిప్స్, వివిధ రకాల జింగర్ బర్గర్లు, రోల్స్, మరెన్నింటినో అందుబాటులోకి తీసుకువచ్చింది. భారతదేశం వ్యాప్తంగా ఉన్న వినియోగదారులు కేఎఫ్‌సీ సిగ్నేచర్ మెను ఐటెమ్‌ల అత్యుత్తమ రుచి, మరియు సాటిలేని క్రంచ్‌తో టెస్ట్ ది ఎపిక్ రుచిని, కేఎఫ్‌సీ బెస్ట్ సెల్లింగ్ మెను ఐటెమ్‌లను మూడు వర్గాలలో అందిస్తున్నారు.

విజ్ఞాన్ స్కూలును సందర్శించిన ఎంఈఓ

విశాలాంధ్ర - భీమిలి: భీమునిపట్నం జీవీఎంసీ పరిధి 4వ వార్డులో గల విజ్ఞాన్ స్కూలును గురువారం ఎం.ఈ.ఓ.-1 శివ రాణి, ఎంపీడీఓ హనుమంతరావు విచ్చేసారు. ఎం.ఎల్.సి. టీచర్స్ ఎలక్షన్ అప్లికేషన్ రిజిస్ట్రేషన్స్ వివరాలు కొరకు విచ్చేసారు. ఈ సందర్భంగా స్కూల్ సిబ్బంది అన్ని వివరాలు తెలిపారు.

స్కోడా కైలాక్ విడుదల

విశాలాంధ్ర - విశాఖపట్నం: తన ఎస్‌యూవీ కైలాక్‌ను స్కోడా ఆటో ఇండియా విడుదల చేసింది. భారతదేశంలో స్కోడా ఆటోకు కైలాక్ కొత్త తరానికి నాంది పలికింది. ఎందుకంటే, ఇది కొత్త మార్కెట్‌లోకి ప్రవేశించి, నూతన వినియోగ దారులను ఆకట్టుకోనుందని స్కోడా ఆటో ఇండియా ప్రతినిధి చెప్పారు. ఫిబ్రవరిలో ఈ ఎస్‌యూవీ ప్రకటనతో భారతదేశంలో మరింత విస్తరించాలని కంపెనీ ఇప్పటికే నిర్ణయాన్ని తీసుకుంది. ఈ ఏడాది ఆక్టోబర్‌లో, స్కోడా ఆటో ఇండియా కైలాక్ ముందుగా హోమ్ ఇన్ఫిసిల్ ప్రీ-ప్రొడక్షన్ వెర్షన్ డ్రైవ్‌ను నిర్వహించింది. ఒక నెల తర్వాత, కైలాక్ ఇప్పుడు దాని ప్రపంచ ప్రీమియర్‌ను ప్రదర్శించగా, బుకింగ్‌లు డిసెంబరు 2, 2024 నుంచి ప్రారంభం అవుతాయని అన్నారు.

జాయింట్ కమిషన్ ఇంటర్నేషనల్ (జేసీఐ) అక్రిడిటేషన్ సాధించిన కాంటినెంటల్ హాస్పిటల్స్

విశాలాంధ్ర - విశాఖపట్నం: ప్రతిష్టాత్మక జాయింట్ కమిషన్ ఇంటర్నేషనల్ అక్రిడిటేషన్‌ను హైదరాబాద్ కు చెందిన కాంటినెంటల్ హాస్పిటల్ పొందిందనట్లు నాలుగుసార్లు జేసీఐ గుర్తింపు పొందిన ఏకైక హైదరాబాద్ హాస్పిటల్ కాంటినెంటల్ హాస్పిటల్స్ హాస్పిటల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి తెలిపారు. అత్యాధునిక, అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తూ.. నాణ్యమైన, ఉన్నతమైన వైద్యసేవలందిస్తోన్న కాంటినెంటల్ హాస్పిటల్స్ కు మరోసారి ఇంటర్నేషనల్ గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా కేవలం రెండు శాతం హాస్పిటల్స్ కు మాత్రమే జేసీఐ గుర్తింపు ఉందన్నారు. యూఎస్ లోని హాస్పిటల్స్ కు 80శాతం జేసీఐ గుర్తింపు ఉందని హైదరాబాదులో కేవలం ఐదు హాస్పిటల్స్ కు మాత్రమే జేసీఐ గుర్తింపు ఉందన్నారు. ప్రతీ మూడు సంవత్సరాలకు ఒకసారి జేసీఐ అక్రిడిషన్ కోసం చాలా కఠిన నియమాలతో అంతర్జాతీయ గుర్తింపు అర్హతను జే సి ఐ ఇస్తుందన్నారు. వారం రోజులపాటు జేసీఐ టీమ్ జరిపిన ఆడిట్ అండ్ సర్వే లో 1183 జేసీఐ ప్రమాణాలకనుగుణంగా వైద్యసేవలందిస్తోన్న కాంటినెంటల్ హాస్పిటల్స్ అని అన్నారు. 2013 లో ప్రారంభమైన కాంటినెంటల్ హాస్పిటల్స్ కు మొదటిసారి 2015 లో జేసీఐ గుర్తింపు లభించింది. అప్పటినుంచి ఇప్పటివరకు నాలుగుసార్లు ఈ ఘనత సాధించింది అంటే... పేషెంట్స్ పట్ల కాంటినెంటల్ హాస్పిటల్స్ చూపే శ్రద్ధ, నిబద్ధత ఎంత ఉన్నతస్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. ముందు ముందు మరింత మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలందించడమే మా లక్ష్యం అన్నారు.

ఏకగ్రీవంగా పంచాయతీ కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో గురువారం ఆనందపురం పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గ సభ్యులు ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులను కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిలో ప్రెసిడెంట్‌గా వి.రామకృష్ణ నాయుడు, వైస్ ప్రెసిడెంట్ కె. భాగ్యలక్ష్మి, జనరల్ సెక్రటరీ ఏ.ధనుంజయ, జాయింట్ సెక్రటరీ -1 షేక్ మౌలాలి, జాయింట్ సెక్రటరీ -2 వి.ప్రసాద్, ట్రెజరర్ శ్రీరాము మూర్తి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు పి. దుర్గా దేవి, కె.చలపతిరావు, జి.విజయలక్ష్మి, సునీత, ఎస్.అనురాధ, సౌజన్య ఎంపికైనట్లు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్ట్ కార్డు ఉద్యమం

- ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ నేతృత్వంలో 10న ఆర్కే బీచ్‌లో ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ నేతృత్వంలో జరిగే 10 లక్షల పోస్ట్ కార్డుల ఉద్యమానికి ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ మేరకు గురువారం నగరంలోని పౌర గ్రంథాలయంలో వివిధ సంఘాల నేతలతో జరిగిన సమావేశంలో పోస్ట్ కార్డుల ఉద్యమానికి సంబంధించి చర్చించారు. ఈ సందర్భంగా సంస్థ కన్వీనర్ బీవీ రమణమూర్తి మీడియాతో మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని పది లక్షల పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టామని తెలిపారు. ప్రపంచంలోనే ఒక సమస్యపై ప్రధానికి 10 లక్షల పోస్ట్ కార్డులు పంపడం రికార్డుగా చరిత్రలో మిగులుతుందన్నారు. ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ వాడవాడలా తిరిగి ఆయా ఇళ్ల వద్దకు వెళ్లి చైతన్యపరిచి పోస్ట్ కార్డులు ప్రధానికి పంపేలా చూడాలని కోరారు. మొదట విడతగా రెండున్నర లక్షల పోస్ట్ కార్డులను సిద్ధం చేశామని, ఒక ఉద్యమంలా ప్రధాన పోస్ట్ ఆఫీస్ కి ర్యాలీగా వెళ్లి పోస్ట్ కార్డులను పోస్ట్ చేయనున్నట్లు కార్యాచరణ రూపొందించామన్నారు. 'సెల్ఫెక్టెడ్ ప్రైమ్ మినిస్టర్, ప్లీజ్ ఎక్ డ్రా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటైజేషన్' అని ఆంగ్లంలో రాసి పోస్ట్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం పోస్ట్ కార్డులు పంపించి ప్రధానమంత్రికి నిరసన వ్యక్తం చేసి ప్రైవేటీకరణ ఆపడమే సంస్థ ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. 1300 రోజులు దాటిన కూడా కేంద్రానికి చీమకుట్టినట్లు లేదని అంటూ పద్దారు. దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ స్టీల్ ప్లాంటును కాపాడుకోవాలన్నారు. ఈ నెల 10న ఆర్ కె బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయం ఎదురుగా ఉదయం 6 గంటలకు పోస్ట్ కార్డుల ఉద్యమం ప్రారంభిస్తున్నామని, కాలేజీల్లో విద్యాసంస్థల్లో విద్యార్థులను కూడా ఈ ఉద్యమంలో పాల్గొనేలా చేయాలన్నారు. ఇంట్లో ఎంతమంది కుటుంబ సభ్యులు ఉంటారో, వారందరి చేత పోస్ట్ కార్డులు వేసేలా చూడాలన్నారు. పోస్ట్ కార్డులు కావలసినవారు 9490690458, 8790012918 నెంబర్లకి కాల్ చేయాలని సూచించారు. సమావేశంలో ఐఎఫ్టియు నాయకులు బి. వెంకటేశ్వర్లు, మహిళా సంఘం నేత లలిత, దళిత నాయకులు వేమన, కాంగ్రెస్ నాయకులు సోదరను సుధాకర్, భీమ్ సేన్ ఆర్మీ వసంత రాజేంద్రప్రసాద్, కోడి కత్తి కేసు న్యాయవాది సలీమ్, భారత నాస్తిక సమాజం శ్రీరామ్మూర్తి, విదసం నాయకులు భూని వెంకటరావు, సంఘాల నాయకులు జై నూకరాజు, సూర్య ప్రకాష్, రాం ప్రభు, జై కొండయ్య, కే దినాకారావు, పులిని అప్పలరాజు, బి.గీత, కొంతాల మోహన కృష్ణ, ఏపీ విద్యా పరిరక్షణ కిషోర్, వెంకటలక్ష్మి, దెంకాడ ఆనంద్, సవరాల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ

ఉచిత గ్యాస్ సిలిండర్ సబ్సిడీ

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: అర్హులైన ప్రతి ఒక్కరికి దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సబ్సిడీ అమౌంట్ అందించబడుతుందని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. గ్యాస్ సబ్సిడీపై ప్రజలు ఆందోళన చెందవద్దని, ఈకెవైసీ చేయడం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ది చేకూరుతుందని తెలిపారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరంలో దీపం పథకంపై జాయింట్ కలెక్టర్ పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో దీపం పథకం కింద అర్హులకు ఒక ఏడాదిలో 3 గ్యాస్ సిలిండర్లు పారదర్శకంగా, ఉచితంగా అందించబడునని తెలియజేసారు. ఈ పథకం క్రింద అర్హులను గుర్తించుటకు ఆధార్ నెంబరు, రేషన్ / బియ్యం కార్డు నెంబరు, ఆధార్ నెంబరుతో లింకు చేయబడిన బ్యాంకు ఖాతా (ఏకౌంటు) నెంబరు, గ్యాస్ కనెక్షన్ నెంబరు మొదలగు వ్యక్తిగత సమాచారాలు తప్పక కలిగి ఉండాలన్నారు. కొంతమంది వినియోగదారులు ఆధార్ కార్డు, బియ్యం కార్డు గ్యాస్ కనెక్షన్ కలిగి ఉన్నప్పటికీ, ఆధార్ లింక్ చేయబడిన బ్యాంక్ ఖాతాను కలిగి ఉండకపోవడం, మరికొందరు ఆధార్ కార్డు, ఆధార్ లింక్డ్ బ్యాంక్ ఖాతా, గ్యాస్ కనెక్షన్ కలిగి ఉన్నప్పటికీ బియ్యం కార్డు లేక పోవడం వలన లబ్ది చేకూరదని తెలిపారు. ఈ పథకం అమలులో లబ్దిదారులు గ్యాస్ డీలర్ వద్ద లేదా గ్యాస్ డెలివరీ సమయంలో డెలివరీ బాయ్ ద్వారా కూడా ఈ-కేవైసీ చేసుకోవచ్చునని అన్నారు. ఈ-కేవైసీ అంటే రైస్ కార్డు, లబ్దిదారుని ఆధారు కార్డును సంబంధిత గ్యాస్ కనెక్షన్‌తో అనుసంధానం చెయ్యటమని చెప్పారు. లబ్దిదారులు తమ వివరాలు లేకపోతే ఆయా సంస్థల, శాఖల నుంచి పొంది నమోదు చేసుకొని ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందవచ్చని ఆయన వివరించారు. ఈ-కేవైసీ ఉచితంగా చేయబడునని ఎటువంటి చెల్లింపులు అవసరం లేదన్నారు. ఈ పథకం క్రింద ప్రయోజనం పొందగోరు లబ్దిదారులు ఆన్లైన్ లేదా ఆఫ్లైన్ ద్వారా రిజిస్టర్డ్ గ్యాస్ ఏజెన్సీతో గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేసుకొని, నిర్ణీత గ్యాస్ ధర యదావిధిగా సంబంధిత గ్యాస్ ఏజెన్సీ వారికి చెల్లించాలని, లబ్దిదారుని వద్ద ఉన్న ఖాళీ సిలిండర్‌ను గ్యాస్ డెలివరీ బాయ్‌కు అందజేయాలని పేర్కొన్నారు. గ్యాస్ ఏజెన్సీతో బుక్ చేసుకున్న తర్వాత, లబ్దిదారుడు ఉచిత గ్యాస్ సిలిండర్‌కు అర్హుడని ఒక మెసేజ్ సందేశాన్ని లబ్దిదారుడు ఫోన్‌కు రావడం జరుగుతుందని, లబ్దిదారుడు ఐదవలో గ్యాస్ ఏజెన్సీకి చెల్లించిన మొత్తము పైకం, పట్టణ ప్రాంతాల్లో ఒక(01) రోజు తర్వాత, గ్రామీణ ప్రాంతాల్లో రెండు (02) రోజుల తర్వాత లబ్దిదారుడు చెల్లించిన గ్యాస్ ధర మొత్తం లబ్దిదారుడి ఆధార్ లింక్ చేయబడిన బ్యాంక్ ఖాతాకు జమ చేయబడుతుందని వివరించారు. మొదటిసారి ఉచిత గ్యాస్ సిలిండర్ పొందేందుకు లబ్దిదారులు అక్టోబర్ 29 నుండి 2025 మార్చి 31వ తేదీ వరకు గ్యాస్ ఏజెన్సీ వద్ద బుకింగ్ చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఐదు నెలల సుదీర్ఘ సమయం ఇవ్వడం జరిగిందని, కావున ఎవరూ గ్యాస్ బుకింగ్‌కు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. వచ్చే ఏడాది ఆర్థిక సంవత్సరంలో మూడు (03) సిలిండర్లు ఉచితంగా నాలుగు నెలలకు ఒకసారి 1. ఏప్రిల్ నుండి జూలై వరకు మొదట సిలిండర్ 2. ఆగస్ట్ నుండి నవంబర్ మధ్య రెండవది 3. డిసెంబర్ నుండి మార్చి వరకు మూడవ సిలిండర్ ఉచితంగా అందజేయబడునని తెలిపారు. ఈ పథకం పొందుటలో ఏవైనా ఇబ్బందులు తలెత్తినచో ఎటువంటి ఆందోళన చెందకుండా 1967 అనే టోల్ ఫ్రీ నెంబర్ కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని , అదేవిధంగా ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయము నందు జరుగు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా, స్థానిక సచివాలయంలో గాని ఫిర్యాదు చెయ్యవచ్చునని అన్నారు. అదేవిధంగా గ్యాస్ డెలివరీ సమయంలో ఎవరైనా అదనపు ఛార్జీలు వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు అన్ని కేటగిరీ లలో 93784 మంది గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకున్నారు, 54011 మందికి డెలివరీ జరిగిందని, వాటిలో అర్హులైన 37385 మందికి 3 కోట్ల రూపాయలు దీపం పథకం కింద లబ్ది చేకూరుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆర్థికంగా మేలు చేయుటకు ఉద్దేశించిన ఈ పథకం, లబ్దిదారులు వినియోగించుకొని ఎటువంటి అవకతవకలకు గాని, బ్లాక్ మార్కెట్ లో అమ్ముటకు గాని పాల్పడరాదని జిల్లా లోని లబ్ది దారులు అందరుకు విజ్ఞప్తి చేశారు. ఈ పత్రికా సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణపై

చంద్రబాబు చేతులెత్తేశారు

ఉత్తరాంధ్రకు అన్యాయం జరుగుతోంది
ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతాం
ఎంపీ విజయసాయిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతామని వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, ఎంపి విజయసాయి రెడ్డి అన్నారు. రీజనల్ కోఆర్డినేటర్‌గా పార్టీ అధిష్టానం నియమించిన తర్వాత ఆయన విశాఖలో మాజీ మంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్ అధ్యక్షతన ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ సమన్వయకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా విజయసాయి రెడ్డి మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణను చంద్రబాబు నాయుడు పూర్తిగా విస్మరించారన్నారు. లక్షల కోట్ల విలువ చేసే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని వేల కోట్లకు విక్రయించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. తాము మొదటి నుంచి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉన్నామని చెప్పారు. అమరావతిని అభివృద్ధి చేయడం కోసం ఉత్తరాంధ్రకు చంద్రబాబు నాయుడు అన్యాయం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. అందులో భాగంగానే ఆర్.బి.ఐ ప్రాంతీయ కార్యాలయాన్ని విశాఖ నుండి అమరావతి తరలించే కుట్ర చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే నియోజకవర్గాల పునర్విభజన జరుగబోతుంది, భవిష్యత్తులో ఉత్తరాంధ్రలో నియోజకవర్గాల సంఖ్య 44 పెరుగు తాయన్నారు. మహిళా కోటాతో పాటు రిజర్వేషన్ల పలుచోట్ల మారతాయని వివరించారు. ఈ పరిణామాలన్నింటిని చర్చించుకుని రాబోవు ఎన్నికలకు సిద్ధమవుతున్నామని తెలిపారు. తాము అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో కార్యకర్తలను నిర్లక్ష్యం చేసిన మాట నిజమేనని వెల్లడించారు. ఇప్పటి నుంచి కార్యకర్తల అభివృద్ధికి పాటు పడతామని చెప్పారు. ఏది ఏమైనప్పటికీ వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ విజయం సాధించే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ సమావేశంలో మాజీ ఉప ముఖ్య మంత్రి బూడి ముత్యాల నాయుడు, మాజీ మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాస్, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా పరిషత్ చైర్మన్ సుభద్ర, శాసన సభ్యులు రేగు మత్స్యలింగం, శాసన మండలి సభ్యులు వరుదు కళ్యాణి, రవి బాబు, మాజీ శాసన సభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్, కన్నా బాబు రాజు, కంబాల జోగులు, పెట్ల ఉమా గణేష్, అదీప్ రాజు, చింతలపూడి వెంకట రామయ్య, భాగ్యలక్ష్మి, శోభ హైమావతి, సమన్వయ కర్తలు కేకే రాజు, మలసల కిషోర్, ఏ.వరలక్ష్మి, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి గుడివాడ రవి కుమార్ (రవి రెడ్డి), ఉరుకూటి అప్పారావు రాష్ట్ర మాజీ చైర్మన్లు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

దారి దోపిడీ దొంగలు అరెస్టు

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: జాతీయ రహదారిలో లోడుతో వెళుతున్న లారీని అడ్డగించి దాడి చేసి డ్రైవర్, క్లీనర్ వద్ద నగదు, ఫోన్లు, దోపిడీ చేసిన దొంగల ముఠాను ఆరిలోవ పోలీసులు అరెస్టు చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను పోలీసులు తెలియజేస్తూ రాత్రి సుమారు 11.00 గంటల సమయంలో విశాఖపట్నం పోర్ట్ నుండి లారీ డ్రైవర్ అప్పలనాయుడు క్లీనర్ చందుతో కలసి మాంగనీస్ లోడుతో బొబ్బిలి వెళు తున్న లారీ హనుమంతవాక జంక్షన్ దగ్గరలో గల జాతీయ రహదారికి ఆనుకొని వున్న విమ్స్ హాస్పిటల్ గేటు దగ్గరలోకి రాత్రి సుమారు 11.30 గంటలకు వచ్చేసరికి ద్విచక్ర వాహనాలపై నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి లారీని అడ్డగించి దాడి చేసి నగదు, మొబైల్ ఫోన్ దోపిడీ చేసినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. డిసిపి క్రైమ్స్ లతా మాధురి ఆదేశాల మేరకు శ్రీహరిరావు, అదనపు డీసీపి క్రైమ్స్ ఎ.వెంకటరావు, ఎ.సి.పి., జోన్-1, సిసిఎస్ వారి అధ్వర్యంలో ద్వారకా సబ్ డివిజన్ క్రైమ్స్ ఇన్స్పెక్టర్ డి.బంగారు పాప, ఆరిలోవ పోలీసు స్టేషన్ ఎస్.ఐ వి.హరి కృష్ణ తమ సిబ్బందితో బృందాలుగా ఏర్పడి నిందితుల గురించి "సమగ్ర సమాచారాన్ని" సేకరించి, నిందితులను అరెస్ట్ చేసి, రెండు సెల్ ఫోన్స్‌తోపాటు వారి వద్దనుండి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

కామ్రేడ్ రమేష్ 7వ వర్ధంతి వేడుకలు



విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని బోద్దపాలెం సిఐటియు కార్యాలయంలో కామ్రేడ్ ఎస్.రమేష్ 7వ వర్ధంతి వేడుకలను సిఐటియు నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా కామ్రేడ్ రమేష్ చిత్రపటానికి భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి, స్థానిక నాయకులు యుఆర్ఎస్ నాయుడు, బి.లక్ష్మణరావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ కామ్రేడ్ రమేష్ ఈ ప్రాంతంలో ఎన్నో ప్రజా ఉద్యమాలు నిర్మించారని ముఖ్యంగా చిట్టివలస జూట్ మిల్ ప్రాంతంలో ఎన్నో కార్మిక ఉద్యమాలు నిర్మించారని ఎంతోమంది కార్యకర్తలను తయారు చేశారన్నారు. ఆయన మరణించి నేటికి ఏడు సంవత్సరాలు కావస్తున్న కార్మిక గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఆయన లేని లోటు కార్మిక ఉద్యమాలకు ఈ ప్రాంతానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ కమిటీ నాయకులు కె.నాగరాణి, ఎస్.అప్పలనాయుడు, కృష్ణచార్య ప్రజానాట్యమండలి సభ్యులు దల్లి రాంబాబు, స్థానిక మహిళలు వివిధ కమిటీ పిల్లలు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి మండలం తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. పాఠశాలకు చెందిన స్కౌట్స్ విద్యార్థులు స్కౌట్ ఉద్యమ నిర్మాత అయిన రాబర్ట్ స్టీఫెన్సన్ పవెల్ చిత్రపటానికి పూలదండ వేసి, జెండాను ఆవిష్కరించడం జరిగిందని పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రధానో పాధ్యాయులు మురళీధర్ తెలిపారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ 1907లో ఇంగ్లాండులో ప్రారంభించిన స్కౌట్ ఉద్యమం భారత దేశంలో 1909లో ప్రవేశపెట్టబడిందని తెలిపారు. అలాగే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన మొదటి సంవత్సరంలో జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్పోర్ట్స్ నాయకులు కలిసి భారత దేశంలో స్కౌట్ గైడ్స్‌ను ఏకం చేయటానికి ప్రయత్నించారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్కౌట్ గైడ్స్ కెప్టెన్, విశాఖ జిల్లా స్కౌట్స్ హెడ్ క్వార్టర్ కమిషనర్ టీఎస్‌వి ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.